31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

గురువారం,అక్టోబర్ 15 , 2026 పేజీలు : 8

## ఆడబిడ్డల ఆత్మగౌరవం, సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**

**-కలెక్టరేట్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 14 :** ఆడబిడ్డల ఆత్మగౌరవం, సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ అని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. బతుకమ్మ సంబరాల్లో భాగంగా బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించగా ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవం సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని, మహిళలు సమిష్టిగా బతుకమ్మ ఆడటం వల్ల సాంఘిక ఐక్యత బలపడుతుందని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజు ప్రత్యేకమైన-మిగతా 2లో



## ఓటర్ల నమోదుకు

# ప్రత్యేక శిబిరాలు

**చురకలు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 14 :** రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధి కారి ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈ నెల 15.10.2026 (గురువారం), 16.10.2026 (శుక్రవారం) ప్రత్యేక శిబిరాలను నిర్వహిం చనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు..ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు (అంటే జాబితాలో చేరని వారు) మొదటిసారి ఓటర్లుగా నమోదు చేసుకోవాలనుకునే యువకులు ఈ నిర్దేశిత కేంద్రాలను సందర్శించి, ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవడానికి 'ఫారం-6' ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పైన పేర్కొన్న రోజుల్లో సంబంధిత బీ ఎల్ ఓ లు బీ ఎల్ ఏ లు ఆయా నిర్దేశిత కేంద్రాలలో అందుబాటులో ఉంటారని తెలిపారు.ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈ నెల 15.10.2026 (గురువారం), 16.10.2026 (శుక్రవారం) ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు చెప్పారు



# ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి సారించాలి

**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 14:** ఎల్‌నినో ప్రభావం, వాతా వరణ మార్పుల నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. రైతులకు శాస్త్రీయ సూచనలు, సలహాలు అందించాలని, పంటలు ఎండిపోకుండా అవసరమై న విద్యుత్ సరఫరా చేయాలని సంబం ధిత అధికారులను ఆదేశించారు. జగిత్యాల జిల్లాలో వ్యవసాయ శాఖ ఆత్మ (ఏటీఎంఏ) ఆధ్వర్యంలో బుధవారం జగిత్యాల పొలాస ప్రాంతీయ పరిశోధన స్థానంలో నిర్వహించిన కిసాన్ మేళా--2026లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజ య్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పాల్గొని రైతులకు పలు సూచన లు చేశారు. వాతావరణ మార్పులను ముందుగానే అంచనా వేసుకొని రైతులు పంటల సాగుపై ప్రణాళిక రూపొందించు కోవాలని మంత్రి సూచించారు. సంప్ర దాయ పంటలతో పాటు వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని తెలిపారు. నీటి లభ్యత, నేల స్వభావం, పెట్టుబడి వ్యయం, మార్కెట్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని పంటలను ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అందించే సలహాలను పాటిస్తూ ఆధునిక పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచిం చారు. రైతులు వ్యవసాయంలో వస్తున్న ఆధునిక మార్పులను అందిపుచ్చుకొని పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుంటూ మెరుగైన దిగుబడులు సాధించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నా రు. పంటల ఎంపిక నుంచి చీడపీడల నివారణ, పంట కోత వరకు శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని సూచిం చారు. రైతులకు -మిగతా 2లో

# ఉత్తరప్రదేశ్ వాసి దారుణ హత్య





చురకలు ప్రతినిధిఎల్లారెడ్డిపేట అక్టోబర్ 14 : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలో దారుణ హత్య ఘటన కల కలం రేపింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన టైల్స్ కాంట్రాక్టర్ పవన్ సింగ్( 35 ) అనే వ్యక్తి హత్యకు గురి అయ్యాడు, పవన్ కు కూలీల మధ్య తలెత్తిన తీవ్ర గొడవ హత్యకు దారితీ సింది ఘటన స్థలాన్ని సి ఐ ఓ వెంక టేష్ ఎస్ ఐ రమేశ్‌లు పరిశీలించారు. ఈ ఘటనతో గొల్లపల్లి గ్రామంలో ఒక్క సారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా యి. పవన్ సింగ్ హత్యకు గల అసలు కారణాలు ఏమిటి ? కూలీల మధ్య గొడవకు దారితీసిన పరిస్థితులు ఏమి టి? అనే అంశాలపై షకీల్ అనే వ్యక్తితో విచారణ చేపట్టారు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన టైల్స్ కాంట్రాక్టర్ పవన్ గత 8 సంవత్సరాలుగా గొల్లపల్లిలో నివా సమై పనిచేస్తున్నాడు గొల్లపల్లిలో ఏరు పుల దేవయ్య కు చెందిన అద్దె ఇంటి లో కిరాయి కి కూలీలు రాజస్థాన్ కు చెందిన జోగేందర్ బీహార్ కు చెందిన శివం ఉత్తరప్రదేశ్ చెందిన ధర్మేందర్ షకీల్‌తో కలిసి ఉంటు న్నాడు. టైల్స్ కాంట్రాక్టర్ పవన్ కూలీలు జోగిందర్ శివం లను తోలుకొని బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో మాచారెడ్డి మండలం చుక్కాపూర్ కు వెళ్ళారు ధర్మేందర్ ను ఎల్లారెడ్డి పేటకు షకీల్ ను అక్కపల్లికి టైల్స్ పని చేయడా నికి బుధవారం ఉదయం పంపాడని షకీల్ చెప్పాడు.మాచారెడ్డికి వెళ్లిన వీరు మద్యం తాగి -మిగతా 2లో

## అర్హులైన ప్రతి ఒక్కరూ

# ఓటరుగా నమోదు చేసుకోవాలి

**-ఈ నెల 15, 16న ఓటరు జాబితాల ప్రత్యేక నమోదు కార్యక్రమం**

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 14:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాల ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలోని వివరాల్లో తప్పులు ఉన్నవారు సవరణలు చేయించుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని, అర్హులైన వారెవరూ ఓటు హక్కుకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు, -మిగతా 2లో

## సీ.పీని కలిసిన ఎంఐఎం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్



**చురకలు ప్రతినిధి, రామగుండం,పెద్దపల్లి,అక్టోబర్ 14 :** ఎంఐఎం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ఎంఐఎం నాయకులు, రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను, పోలీస్ కమిషనరేట్ లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు కలిసినట్లు గులాం అహ్మద్ హుస్సేన్ తెలిపారు.గులాం అహ్మద్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత పెద్దపల్లి జిల్లా నాయకులతో కలిసి, రామగుండం పోలీసు కమిషనర్‌ను కలవడం పార్టీలో ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం,తమ వంతుగా పోలీసు శాఖకు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.ఈకార్యక్రమంలో ఎంఐఎం పెద్దపల్లి నాయకులు ఇమ్రాన్ అడ్వకేట్,ఉమెర్,కలీం,గోదావరిఖని నాయకులు మీర్ జాకీర్ అలీ, ఖాదర్ అలీ నాయబ్,రామగుండం నాయకులు నసిర్,ఆర్బాజ్,కరీంనగర్ నాయకులు అబ్దుల్ గఫ్ఫార్, మెరాజోద్దీన్,షాకిర్ నహ్దీ,అబ్దుల్లాఖాన్,అయాన్ నహ్దీ పాల్గొన్నారు.

## ఈనెల 15,16 తేదీల్లో ఓటరు జాబితాల ప్రత్యేక నమోదు కార్యక్రమం

**-అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి**

**-జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 14 :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 15, 16 తేదీల్లో ఓటరు జాబితాల ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఒక ప్రకటనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలో వివరాలు తప్పుగా ఉన్నవారు సవరణలు చేయించుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు ఈ రెండు రోజులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. కొత్తగా పేరు నమోదు, పేరు తొలగింపు, చిరునామా మార్పు, ఇతర వివరాల సవరణలకు సంబంధించి అవసరమైన దరఖాస్తులను సమర్పించవచ్చని పేర్కొన్నారు. ప్రత్యేక నమోదు కార్యక్రమంలో భాగంగా సంబంధిత బూత్ స్థాయి ఏజెంట్లు కూడా పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు.బి ఎల్ ఏ, బి ఎల్ ఖ సమక్షంలో ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి, అవసరమైన సవరణలను గుర్తించి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా కోరారు. అర్హులైన వారెవరూ ఓటు హక్కుకు దూరం కాకుండా ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు.

# కూష్మాండా దేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



జగిత్యాల, అక్టోబర్ 14 : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు బుధవారం అమ్మవారు శ్రీ కూష్మాండా దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.జగిత్యాలలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా, భక్తి, శ్రద్ధాలతో నిర్వహిస్తున్నారు.నవదుర్గలలో నాలుగవ అవతారమైన కూష్మాండా దేవిని ఆదిశక్తిగా కొలుస్తారు. లోకంలో చీకటి తప్ప ఏమీ లేనప్పుడు తన చిరునవ్వుతో బ్రహ్మాండాన్ని సృష్టించిందని పురాణ కథనం. కు అంటే చిన్న, ఉష్మా అంటే శక్తి, అండా అంటే బ్రహ్మాండం అని అర్థం.ఈ తల్లి సూర్య మండలంలో నివసిస్తూ సృష్టికి వెలుగు, శక్తిని ప్రసాదిస్తుందని భక్తుల నమ్మకం. అష్టభుజాలతో, సింహ వాహనంపై దర్శనమిస్తూ ఆరోగ్యం, ఐశ్వర్యం, సానుకూల శక్తిని ప్రసాదిస్తుందని పండితులు తెలిపారు. ఈ రోజు రాయల్ బ్లూ రంగు ప్రత్యేకం. మార్కండేయ ఆలయంలో జగిత్యాల మార్కండేయ ఆలయంలోని అమ్మవారికి భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి ఒడిబియ్యం సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కౌన్సిలర్ మ్యానపురి పవిత్ర మహేష్, గంగాధర్, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, సార ఆయాన్స్ రెడ్డి, సార ఆధ్వి రెడ్డి, దీక్ష పరులు పాల్గొన్నారు.జగిత్యాల పట్టణంలోని నవ దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు నిర్వాహకులు 4వ రోజు కూష్మాండా దేవి అలంకారంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. అమ్మవారికి మాల్పువా నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.కార్యక్రమంలో బక్కశెట్టి లక్ష్మి, పెండెం జలంధర్, అలిశెట్టి రాజు, జితేందర్ ( జెడి ), దీక్షస్వాములు పాల్గొన్నారు.అలాగే మోతె రోడ్డులోని ఎల్లమ్మ ఆలయంలో వనదుర్గ సేవా సమితి, శ్రీరామ్ థియేటర్ దగ్గరలోని జయదుర్గ సేవా సమితి దుర్గామాత వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కౌన్సిలర్ ఆరవ లక్ష్మి, బిట్టు, లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.పొలాసలోని శ్రీ చక్ర సహిత లలితమాత ఆలయంలో ఆలయ ఫౌండరి చైర్మన్ చెల్లంస్వరూప, మహేందర్, సత్తయ్య, పొలాసలోని సహస్ర లింగాల ఆలయం లో ఆలయ ఫౌండరి చైర్మన్ నలమాసు గంగాధర్,కొయ్యాడ శేఖర్,లు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు., అష్టలక్ష్మి టెంపుల్ దగ్గర ఏర్పాటు చేసిన దుర్గామాతలకు ప్రత్యేక అలంకారాలు చేసి భక్తులు దర్శించుకున్నారు.బుగ్గారం మండలంలోని చందయ్యపల్లె, చిన్నాపూర్, బుగ్గారం, ఆనంతారం, గుల్లపేట, కల్లెడ తదితర గ్రామాల్లో కూడా అమ్మవారిని భక్తి శ్రద్ధలతో కొలిచారు.సర్పంచ్ లు గాదే మహేష్, ఉపసర్పంచ్ మ్యాకల వెంకటేష్, రాచర్ల భీమేష్, గట్టు శారదా గంగయ్య, పాదం కొమురయ్య, గడ్డం రమేష్, బుర్ర రమేష్,నక్క రాజవ్వ, జంగా శ్రీనివాస్, నగునూరి నర్సాగౌడ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డల ఆత్మగౌరవం, సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

**మొదటి పేజీ తరువాయి....** పేర్లతో బతుకమ్మ పండగ మహిళలు నిర్వహిస్తారని, ఐదవ రోజు అట్ల బతుకమ్మ కాగా ప్రకృతి ప్రసాదించిన తంగేడు, గునగ, బంతి, రంగు రంగుల పూలతో బతుకమ్మను అలంకరించి మహిళలు ఆట, పాటలతో పండుగ చేసుకోవడం నిజంగా కన్నులపండుగలా ఉందని, ఈ వేడుకల్లో పాల్గొనడం అనందంగా ఉందన్నారు. మహిళా అధికారులు, సిబ్బంది ఉత్సాహకంగా బతుకమ్మ పాటలు పడుతూ బతుకమ్మ ఆడారు. మహిళలు బతుకమ్మ నిమజ్జనం సమయంలో చెరువులు, కుంటలు, వాగుల వద్ద జాగ్రత్త వహించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ నిమజ్జనం ఏర్పాట్లు చేసినట్లు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎస్. ప్రసూనాంబ, డిడబ్ల్యూవో భాస్కర్, మహిళా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి సారించాలి

**మొదటి పేజీ తరువాయి...**నూతన వంగడాలు, ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచిం చారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు నీటి వనరు లను పొదుపుగా వినియోగించుకోవాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు. గ్రామస్థాయిలో రైతులకు పంటల ఎంపిక, విత్తనాలు, ఎరువుల వినియోగం, చీడపీడల నివారణపై అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. పంటలు ఎండిపోకుండా అవసరమైన విద్యుత్ సరఫరా అందించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. కిసాన్ మేళాలో వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు పరిశీలించారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, నూతన సాగు పద్ధతులు, పంటల నిర్వహణ విధానాలపై నిపుణులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి వినియోగం, పంటల సంరక్షణపై సూచనలు అందించారు.ఈ సందర్భంగా ఉత్తమ రైతులు, ఉత్తమ వ్యవసాయ అధికారులను సన్మానించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు ప్రతిజ్ఞ చేశారు.జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు,అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తరప్రదేశ్ వాసి దారుణ హత్య

**మొదటి పేజీ తరువాయి...** గొల్లపల్లి లోని అద్దె ఇంటికి తిరిగి మధ్యాహ్నం రెండు గం టల ప్రాంతంలో వచ్చి ఉండవచ్చునని మధ్యాహ్నము మూడు గంటల ప్రాంతంలో గొడవ జరుగుతుందని ఇంటి ఓనర్ రాములు కు ఫోన్ రాగా ఆయన వచ్చి చూడగా ఆ గదిలో ఉన్న సీసీ కెమెరా వైరింగ్ నిందితులు కట్ చేసి గదికి తాళం వేసి ఉంది. రక్త మడుగులో పవన్ హత్య గురై మరణించడంతో ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం అందించగా, సీఐ వెంకటేష్ ఎస్సై రమేష్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు, గదిలోనే కూరగాయల కోసే కత్తితో పవన్ ను గొంతు కోసి రెండు మూడు చోట్ల గుండెపై పొడిచి హత్య చేసి నిందితులు ఇద్దరు ఘటన స్థలంలో విగిత జీవిగా రక్తం మడుగులో పడి ఉన్నాడు మృతుడు పవన్ సెల్ఫోన్తో జోగిందర్ శివం లు పారిపోయినట్లు తేలుస్తుంది, వారికోసం పోలీసులు గాలిస్తున్నారు మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వెంకటేష్ తెలిపారు, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు,

## అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

**మొదటి పేజీ తరువాయి...**పేరు తొలగింపు, చిరునామా మార్పు, ఇతర వివరాల సవరణలకు సంబంధించి అవసరమైన దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు. ప్రజలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సంప్రదించి ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావాలని అధికారులు సూచించారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు రెండు రోజులూ తప్పనిసరిగా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లను పరిశీలించుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువత, ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటర్లు తమ వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కోరారు.

## కోటేశ్వరస్వామి ఆలయ పునః నిర్మాణ పనులు పరిశీలించిన బిజెపి నాయకులు



**చురకలు,విలేఖరి, వెల్గటూర్, అక్టోబర్ 14 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం శాతవాహన రాజధాని కోటిలింగాలలో గోదావరి పుష్కరాలు పుర స్కరించుకొని శ్రీకోటేశ్వరస్వామి పురాతన ఆలయాన్ని తొలగించి నూతనంగా పునః నిర్మాణం చేపడుతున్నందున బుధవారంధర్మపురినియోజక వర్గ ఇంచార్జి కొమ్ముారాంబాబు ఆధ్వర్యంలో పలువురు బిజెపి నాయకులు ఆలయాన్ని సందర్శించి నిర్మాణపనులను పరిశీలించారు.పవిత్ర గోదావరి తీరంలో సిద్దులు నిర్మించిన మహిమాన్విత ఆలయమైనందున ఆలయ పవిత్రతకు ఎలాంటి భంగం కలగకుండా ఆగమ వాస్తుశాస్త్ర ప్రకారం నిర్మాణ పనులు చేపట్టాలని,గర్భగుడి నిర్మాణం కృష్ణశిలలతో నిర్మాణం చేపట్టాలని కోరారు. బిజెపి నాయకులు బుద్దె పోచయ్య, బండారి గంగాధర్, ముదిమడుగుల భూమేష్, గుమ్ముల మల్లేష్, గాలిపెల్లి నరేష్, బీసవేని హరీష్, వేముల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కూష్మాండ అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



**చురకలు విలేకరి,జగిత్యాల,అక్టోబర్ 14 :** కనక దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో అష్ట లక్ష్మి దేవాలయ ఆవరణలో నిర్వహిస్తున్న దుర్గ శరన్నవ రాత్రోత్సవాలలో భాగంగా నాలుగవ రోజు బుధవారం అమ్మవారు కూష్మాండ అవతార శాకాంబరీ అలంకారణలో దర్శనం ఇచ్చారు.సప్త హారతులతో విశేష కనక దుర్గ అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు.ఉదయం నిత్య పూజ, నక్షత్ర హారతి అనంతరం అభిషేకం భవానీ మాతలు, దీక్ష పరులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.అనంతరం సప్త హారతులతో కనక దుర్గా అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.అనంతరం అమ్మవారి మండపానికి చేరుకున్న భక్తులు బిక్షగా అన్నప్రసాదం స్వీకరించినట్లు కనక దుర్గ సేవ సమితి సభ్యులు తెలిపారు.

## నూతన అదనపుకలెక్టర్‌కు అభినందనలు

**-సన్మానించిన నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నేతలు**



**చురకలు విలేకరి,జగిత్యాల,అక్టోబర్ 14 :** జగిత్యాల జిల్లాకు నూతనంగా నియమితులైన అదనపు కలెక్టర్ ఎన్.ప్రసూనాంబను జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు క్యారంగుల అరుణ,కార్యదర్శి ఉమ్మడి నారాయణ తదితర నేతలు మర్యాదపూర్వకంగా బుధవారం కలిసి అభినందించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌కు శాలువా కప్పి,పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.జిల్లాలో నాల్గవతరగతి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు.దీనికి సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్ ప్రసూనాంబ,ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సంఘం నేతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘంనాయకులు శంకరమ్మ,సుమన్,రవి పాల్గొన్నారు.

# ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటాం

**-రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
**-ఉక్రెయిన్‌లో మృతి చెందిన సుదర్శన్ గౌడ్ కుటుంబానికి రూ.6 లక్షల చెక్కు అందజేత**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 14 :** ఉక్రెయిన్ లో మృతి చెందిన సుదర్శన్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన జగిత్యాల జిల్లా హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.6 లక్షల ఆర్థిక సాయం చెక్కును బుధవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అందజేశారు. ఉపాధి కోసం నాలుగు నెలల క్రితం ఉక్రెయిన్ వెళ్లిన సుదర్శన్ గౌడ్ క్షిపణులు, డ్రోన్ దాడుల్లో మృతి చెందారని, బాధిత కుటుంబ విజ్ఞప్తిపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం స్పందించి రూ.6 లక్షల సాయం ప్రకటించారని తెలిపారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, జిల్లా మండల నాయకులు, ఎన్ఆర్ఐ సెల్ సభ్యులు పాల్గొన్నారు.

# తల్లిని పోషించని కొడుకులు

**-టాస్క్ ద్వారా ఆర్డీవోకు ఫిర్యాదు**



**చురకలు విలేకరి, జగిత్యాల అక్టోబర్ 14 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం శాఖాపూర్ గ్రామానికి చెందిన దొరిశెట్టి నాగమ్మ (78) అనే వృద్ధురాలు అనారోగ్యంతో ఛాతి పై పెద్ద గడ్డతో, మోద కాలుతో భాద పడుతు కన్న కొడుకులు భూమయ్య,తిరుపతిలు తనను నిరాదరిస్తూ పోషణ వైద్య ఖర్చులు పెట్టడం లేదని జగిత్యాల జిల్లా కేంద్రం లోని సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు, న్యాయవాది హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించింది. కాగా బుధవారం సీనియర్ సిటిజెన్స్ ప్రతినిధులతో వెళ్లి ఆర్డీవో కు ఫిర్యాదు చేయగా వయో వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు.అనంతరం ఆ వృద్ధతల్లి సీనియర్ సిటిజెన్స్ కార్యాలయంలో తన గోడు విలేకరులకు వినిపించారు. తన కొడుకులు తన మరణించిన భర్త పోచమల్లు పేరిట ఉన్న 7 ఎకరాల భూములను తమ పేరిట చేసుకున్నారని, చెరి ఒక ఇల్లు సైతం కట్టించానని, అయినప్పటికీ వారి ఇండ్లలో తనకు చోటివ్వక చిన్న రేకుల షెడ్డులో ఉంచారని, అనారోగ్యంతో ఛాతిపై గడ్డతో, మోద కాలుతో భాద పడుతున్న నన్ను పోషించాల ని,వైద్యం చేయించాలని కోరితే కొడుకులు, కోడళ్ళు విపరీతంగా కొడుతున్నారని రోదిస్తూ తెలిపింది.నా కొడుకు లు నన్ను పోషిస్తూ, వైద్య ఖర్చులు పెట్టేలా నెలకు చెరి రూ. 10 వేలు ఇచ్చేలా, నా కొడుకులు, కోడళ్ళు నన్ను కొట్టకుండా తగు చర్యలు తీసుకోవాలని సీనియర్ సిటిజెన్స్ సంఘాన్ని ఆశ్రయించి ఆర్డీవో కు ఫిర్యాదు చేయగా కొడుకులపై కేసు నమోదు చేశారని, ఎస్పీకి సైతం ఫిర్యాదు చేస్తానని ఆ వృద్ధ తల్లి విలేకరుల ముందు ఏడుస్తూ చెప్పింది. ఆ వృద్ధ తల్లి వెంట ఆమె బంధువులు,,జిల్లా సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్, జిల్లా కార్యదర్శి గౌరి శెట్టి విశ్వనాతము, కాన్సిలియేషన్ అధికారులు పి. హన్మంత్ రెడ్డి,బొల్లం విజయ్, వెల్ముల ప్రకాష్ రావు తదితరులున్నారు.

# ఇందిరమ్మ ఇంట్లో గృహప్రవేశం



**-జువ్వాడి నర్సింగరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు**

**చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్,14 :**

మెట్‌పల్లి పట్టణంలోని 7వ వార్డుకు చెందిన అనసూర్య-నర్సింలు దంపతులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో, ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వెలమ సంస్థ ఆధ్వర్యంలో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయి ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు సహకారంతో మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి హాజరై గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగాఅనసూర్య-నర్సింలు దంపతులు మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ నవీన్,4వ వార్డు కౌన్సిలర్, 7వ వార్డు కౌన్సిలర్, పట్టణ మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ జాకీర్ లను శాలువాలతో సన్మానించారు.తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడానికి కృషి చేసిన జువ్వాడి నర్సింగరావుకు దంపతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగిత్యాల డీసీసీ మైనారిటీ చైర్మన్ నయీమ్‌కు ఘన సన్మానం



**చురకలు ప్రతినిధి కోరుట్ల అక్టోబర్ 14 :** జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) మైనారిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.ఏ. నయీమ్‌ను ఏఆర్ వెజిటబుల్స్ యాజమాన్యం మొహమ్మద్ అర్షద్, మొహమ్మద్ అష్ఫు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నయీమ్‌కు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నయీమ్ మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం, యువత అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సంబంధిత నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఏఆర్ వెజిటబుల్స్ యాజమాన్యం మాట్లాడుతూ నయీమ్ మైనారిటీల అభ్యున్నతికి, యువత సంక్షేమానికి, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనారిటీ యువకులు పాల్గొన్నారు.

# మహాచండీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

**-గ్రామగ్రామాన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు**
**-ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ఆధ్యాత్మిక సందడి**



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 14 :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి, బర్దిపూర్, ములరాంపూర్, గోదూర్, తిమ్మాపూర్, ఇబ్రహీంపట్నం, డబ్బా, యామాపూర్, ఎర్దండి, ఫకీర్ కొండాపూర్, వర్షకొండ, అమ్మకపేట,కోమటికొండాపూర్, కేశాపూర్,కోజన్ కొత్తూరు గ్రామాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల తో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు మహాచండీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

**ప్రత్యేక పూజలు.. అభిషేకాలు..**

ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల్లో అర్చకులు వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉదయం నుంచే భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారి మండపాలకు చేరుకుని దర్శనం చేసుకున్నారు. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భవానీ దీక్ష భక్తులు సైతం పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

**అమ్మవారి నామస్మరణతో ఆధ్యాత్మిక శోభ..**

మహాచండీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు భక్తిశ్రద్ధలతో కొలిచారు. అమ్మవారి నామస్మరణలు, భక్తిగీతాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను తొమ్మిది రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీల సభ్యులు, మహిళలు, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు కోసం రహదారిపై రైతుల బైఠాయింపు

**-పాత ఎర్దండి లైన్ పునరుద్ధరించాలని రైతుల డిమాండ్**
**- రైతులకు పంటల చివరి దశలో కరెంటు కష్టాలు**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (14) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కోమటి కొండాపూర్ గ్రామ రైతులు విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రహదారిపై బైఠాయించారు. పంటలు చివరి దశలో ఉన్న సమయంలో వ్యవసాయానికి సరిపడా విద్యుత్ అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పాత ఎర్దండి విద్యుత్ లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి, ఆ లైన్ ద్వారా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. వ్యవసాయ అవసరాల కోసం త్రీఫేజ్ విద్యుత్‌ను ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఇబ్రహీం పట్నం నుంచి సక్రమంగా విద్యుత్ సరఫరా అయ్యేదని, ప్రస్తుతం సబ్‌స్టేషన్ అందుబాటులో ఉన్నప్పటికీ ఒకే ఫీడర్ ద్వారా సరఫరా చేయడంతో సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు పేర్కొన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించి, పంటలకు నష్టం కలగ కుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు రాస్తా రోఖో చెయటం తో గంట పాటు రాకపోకలు నిలిచాయి. ఈకార్యక్రమం లో రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్ల పట్టివేత



**- రెండు ట్రాక్టర్ల సీజ్..**
**-యజమానులపై కేసు నమోదు**

**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (14) :** మల్లాపూర్ మండలం పాతుధామరాజుపల్లి గ్రామ శివారులోని గోదావరి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అధికారులు పట్టుకున్నారు. నది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తవ్వి, ఇబ్రహీంపట్నం మండలంలోని వివిధ గ్రామాలకు తరలిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామానికి చెందిన పూజారి చిన్న సాయిలు (39), లస్మయ్య కుమారుడు, రేపాని మోహన్ (43), హనుమంతు కుమారుడికి చెందిన ట్రాక్టర్లు అక్రమ ఇసుక రవాణా వ్యవహారంలో పట్టుబడ్డాయి. ఈ క్రమం లో టిఎస్18ఎ7005, ఎపి15బిఎన్ 8513 నంబర్లు గల రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యమాపూర్ జీపీఓ కుండ శ్రీనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి, వాటి యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

## దుర్గాదేవి సన్నిధిలో భజన కార్యక్రమం



**- అమ్మవారి సన్నిధిలో నిర్వాహకులకు సన్మానం**

**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం, అక్టోబర్ (14) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు రాత్రి అమ్మవారి పల్లకి సేవ సందర్భం గా భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమం నిర్వహించారు. బజరంగ్ దళ్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మెట్‌పల్లి సాయిశ్రీనివాస ఆసుపత్రి ఇన్‌చార్జి అవుట్ల లక్ష్మణ్ సహకారం తో గురుస్వామి సామల్ల గంగాధర్, రంగు శ్రీనివాస్, అంకతి భరత్ కుమార్, వెంకటేష్,వినోద్, స్వామి తదితర అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు అమ్మవారి భక్తి పాటలు ఆలపిస్తూ భజన సంకీర్తనలు చేశారు. అమ్మవారి పల్లకి సేవతో పాటు భజన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో కార్యక్రమ నిర్వాహకులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములైన వారిని సత్కరించి అభినందించారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గ్రామంలో భక్తి భావాన్ని నింపుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో బజరంగ్ దళ్ యువసేన సభ్యులు, భవనీ స్వాములు ,మహిళలు. భక్తులు. తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో వెంకటేశ్వర స్వామి పల్లకి సేవ



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం,అక్టోబర్ (14) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదూర్, తిమ్మాపూర్, యామాపూర్, వేములకుర్తి, వర్షకొండ,ఇబ్రహీంపట్నం గ్రామాల్లో శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా విజయదశమికి ముందు నిర్వహించే స్వామివారి పల్లకి సేవలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బుధవారం నాలుగవ రోజు ఆయా గ్రామాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో కొలువుదీర్చి,అర్చకుల వేదమంత్రోచ్ఛారణల నడుమ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా హంస వాహనాలపై స్వామివారి దర్శనం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించింది. భక్తులు స్వామివారికి మంగళహారతులు సమర్పించి,ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి సేవలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక సేవలో శ్రీ నవదుర్గ సేవాసమితి



**చురకలు విలేకరి, రాయికల్, అక్టోబర్ 14 :** ఆధ్యాత్మిక సేవలో శ్రీ నవదుర్గ సేవాసమితి వ్యవస్థాపకులు రాయికల్ పట్టణంలోని మార్కండేయ నగర్ లో ఏర్పాటుచేసిన దుర్గ దేవి మండపం వద్ద అన్నపూర్ణ దేవి అలంకరణలో భాగంగా అన్నప్రసాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు మచ్చ గంగ లక్ష్మి,మానస, స్రవంతి,రాకేష్ నాయక్,కల్లెడ ధర్మపురి,శ్రీధర్,నాయకులు మచ్చ శేఖర్,ఎలిగేటి అనిల్,తు రగ శ్రీధర్ రెడ్డి, నాగరాజు,భూమేష్, సురేష్, రాము, మహిపాల్, నవదుర్గ సేవ సమితి వ్యవస్థాపక సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

## దసరా బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



**చురకలు విలేకరి,రాయికల్, అక్టోబర్ 14 :** దసరా బతుకమ్మ ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ బుధవారం పరిశీలించారు. రాయికల్ పెద్ద చెరువు పరిసర ప్రాంతాల్లో బతుకమ్మ ఏర్పాట్ల విద్యుత్ దీపాలు,బతుకమ్మ ఆటస్థలం, నిమజ్జనం ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి కావలసిన ఏర్పాట్లను అధికారులకు సూచించారు. దసరా పండుగను పురస్కరించుకొని పండుగ నిర్వహణ జంబి స్థలం, సమీ పూజ పరిసర ప్రాంతాలను మున్సిపల్ పాలకవర్గంతో కలిసి పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు కిరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి గుంతను పూడ్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్,వైస్ చైర్మన్ తురగ సౌజన్య,కౌన్సిలర్లు తోపారపు స్రవంతి సురేష్,రాకేష్ నాయక్ నాయక్, కూనారపు మానస భూమేష్, వేముల మౌనిక రాము,ఎలిగేటి లతిక అనిల్, పల్లికొండ గంగాధర్,బత్తిని మహేశ్వరి నాగరాజు, మచ్చ గంగ లక్ష్మి,పుర్రె శ్రీధర్,కల్లెడ ధర్మపురి, కోఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, మహేష్, సుధ వేణి లత మురళి, ఇంతియాజ్ పర్వీన్,నాయకులు తురగ శ్రీధర్,మచ్చ శేఖర్, మేనేజర్ వెంకటి, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాపై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు

**-రాజకీయ దురుద్దేశంతోనే బురదజల్లుతున్నారు**
**-కాంగ్రెస్ సీనియర్ నేత పత్తి కృష్ణారెడ్డి ఘాటు వ్యాఖ్యలు**




**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 14 :** తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసి,రాజకీయంగా అప్రతిష్ఠపాలు చేయాలనే ఉద్దేశంతో కొందరు పనిగట్టుకుని తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వెంకట్రావుపల్లి సర్పంచ్ అనిత భర్త పత్తి కృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆధారాలు లేని ఆరోపణలతో తన ప్రతిష్ఠను దిగజార్చేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదని,అవసరమైతే న్యాయ స్థానాలను ఆశ్రయించి చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు .బుధవారం హుజురాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రజిని కుమార్ యాదవ్ తనపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఆ ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని, కల్పిత కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

**చట్టబద్ధంగానే భూమి రిజిస్ట్రేషన్**

వివాదంగా మారిన భూ వ్యవహారంపై కృష్ణారెడ్డి వివరణ ఇస్తూ, 2019లో తన సొంత సోదరుడు పత్తి విష్ణువర్ధన్ రెడ్డి నుంచి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎకరం నాలుగు గుంటల భూమిని చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. ఈ లావాదేవీలో ఎలాంటి అక్రమాలకు తావులేదని,అన్ని వివరాలు పత్రాలతో సహా వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.

**బాకీ చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నా**

ఈ వ్యవహారంలో ఆరోపణలు చేస్తున్న దివంగత ఓదెలుతో గానీ, ఆయన కుమారుడితో గానీ తనకు ప్రత్యక్ష ఆర్థిక సంబంధాలు, లావాదేవీలు లేవని స్పష్టం చేశారు. తన సోదరుడు విష్ణువర్ధన్ రెడ్డికి సంబంధించిన బకాయిల విషయం వచ్చినప్పుడు కుటుంబ బాధ్యతగా ఆ మొత్తాన్ని చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.గతంలో బకాయి కింద రూ.2.70లక్షల చెక్కు ఇచ్చేందుకు ముందుకొచ్చినా,దానిని తిరస్కరించారని గుర్తుచేశారు.బకాయి సొమ్ము తీసుకోవడం కంటే విలువైన భూమిని స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతోనే కొందరు తనపై ఒత్తిడి తెస్తున్నారని ఆయన ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం తన పేరును వివాదంలోకి లాగుతూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

**పరువు నష్టం దావా వేస్తా**

తనపై అసత్య ప్రచారాన్ని తక్షణమే నిలిపివేయాలని పత్తి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.లేనిపక్షంలో పరువు నష్టం దావాతో పాటు ఇతర చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోనని హెచ్చరించారు.వాస్తవాలను పక్కనపెట్టి వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీయాలని ప్రయత్నిస్తే న్యాయపోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

# కులం పేరుతో దూషించిన వారిని చట్టపరంగా శిక్షించాలి

**-ఎమ్మార్పీఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ డిమాండ్**




**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట ఆక్టోబర్ 14 :** కులం పేరుతో దూషిస్తూ కర్రలతో దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఎంఆర్‌పిఎస్ఎంఎస్ పి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ప్రెస్ మీట్‌లో జిల్లా కమిటీ బాధ్యులు మాట్లాడుతూ బోయిన్పల్లి మండలం మల్లాపురం గ్రామంలో 11 తారీఖు నాడు రాత్రి మాదిగ యువకుల పైన మరియు మాదిగ ఇండ్ల పైన దాడి చేసిన కొంతమంది రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు బీసీ వర్గానికి చెందినవారు ఇష్టమొచ్చినట్టు కులం పేరుతో దూషిస్తూ కర్రలతో దాడి చేసినారు వాళ్లను వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది.వాళ్లను అదే రోజు రాత్రి దాడి జరిగినప్పుడు పోలీస్ అధికారులు స్పందించారు కానీ వెంటనే అదుపులోకి తీసుకుంటే బాగుండేది కానీ అక్కడ పోలీస్ అధికారుల ముందే ఇష్టం వచ్చినట్లు బూతులు తిడుతూ వీరంగం సృష్టించడం జరిగింది కావున నిందితులు నడిగొట్టి కౌశిక్ కులం చాకలి దుర్మట్ల సాయినాథ్ రెడ్డి కులం రెడ్డి దుర్మట్ల నాగేందర్ రెడ్డి కులం రెడ్డి ఆకుల రాము మున్నూరు కాపు. దుర్మట్ల భూమి రెడ్డి కులం రెడ్డి వీళ్లను చట్టపరంగా ఏ సెక్షన్ లో అయితే ఉన్నాయో వాటి ప్రకారం అరెస్టు చేసి వెంటనే జైలుకు పంపాలని డిమాండ్ చేస్తున్నాం.అదేవిధంగా వేములవాడ అర్బన్ తిప్పాపూర్ గ్రామానికి చెందిన సుంకపాక రాజయ్య మాదిగ కులం చెందిన కూలి తేదీ 6 అక్టోబర్ 2026 రోజున మనకోసం మానుక శ్రీనివాస్ యాదవ్ తన సొంత వ్యవసాయ భూమిలో పత్తి చేనులో దోరా కొట్ట డానికి కూలికి తీసుకొని పోయినాడు ఉదయము 11 30 నిమిషాలకు అదే పత్తి చేనులో పడి ఉన్నాడని రాజయ్య కుమారునికి ప్రశాంత్ కు ఫోన్ చేయడం జరిగింది శ్రీనివాస్ రైతు వెంటనే రాజయ్య కుటుంబ సభ్యులు వచ్చి చూడదు చూడగా అనుమాన స్థితిలో మృతి చెంది ఉన్నాడు వెంటనే గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ కి తీసుకు పోవడం జరిగింది అక్కడ డాక్టర్లు చూసి చనిపోయినాడు అని చెప్పినారు మృతుని శరీరంపై కాలిన గాయాలు ఉన్నందున కరెంట్ షాక్ తో చనిపోయినట్టుగా అనుమానం ఉన్నది కాబట్టి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. పోస్టుమార్టం నిర్వహించడం కూడా జరిగింది కావున చనిపోయిన రాజయ్య అనుమానాస్పదం గా మృతి చెందిన వాడు కాబట్టి పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి రాజయ్య కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నాం.ఈ రెండు సంఘటనల మీద క్లుప్తంగా పారదర్శకంగా పోలీస్ అధికారులు విచారణ చేయాలని కోరుతున్నాం.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవు నూరి ప్రభాకర్ మాదిగ ఖానాపురం లక్ష్మణ్ మాదిగ ఆవునూరు లచ్చన్న మాదిగ, వికలాంగుల హక్కుల నాయకురాలు సడమల శోభ రాణి మాదిగ,మహిళా సంఘం అధ్యక్షురాలు పంగ శిరీష మాదిగ, నియోజవర్గం నాయకులు సామల్ల ప్రతాప్ మాదిగ, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షులు మునిగే ఎల్లం మాదిగ, వేములవాడ అధ్యక్షులు ఎడపల్లి శేఖర్ మాదిగ, వీర్నపల్లి మండల అధ్యక్షులు కంచర్ల సురేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# వాసవి సేవాదళ్ వైస్‌చైర్మన్‌కు మాజీ మంత్రి ఘన సన్మానం

**చురకలు ప్రతినిధి,నిర్మల్,అక్టోబర్, 14 :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ, వాసవి సేవాదళ్ 2026--2028 నూతన కార్యవర్గంలో చైర్మన్‌గా నియమితులైన ఆమెడ.శ్రీధర్ ను మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు స్వీకరించిన ఆమెడ.శ్రీధర్ ను అల్లోల.ఇంద్రకరణ్ రెడ్డి, ప్రతినిధులు అభినందనలు తెలియజేస్తూ, వాసవి సేవాదళ్ అభివృద్ధికి, ఆర్యవైశ్య సమాజ సేవా కార్యక్రమాల విస్తరణకు ఆయన నాయకత్వం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వాసవి



సేవాదళ్ ద్వారా సమాజ సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతూ, ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు

## చిన్నారులను అభినందించిన ఎస్ఐ



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (రామగిరి) అక్టోబర్ 14 :** కరాటేలో ప్రతిభ కనబరిచిన చిన్నారులను రామగిరి ఎస్సై శ్రీనివాస్ అభినందించారు. హైదరాబాద్ లో 1,212 మందితో జరిగిన అతిపెద్ద కరాటే ప్రదర్శనలో పాల్గొని ప్రపంచ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన మన రామగిరి మండల విద్యార్థులు లొంకాకేసరం మాజీ సర్పంచ్ ఎండి మంజుర్ మనుమరాలు మహమ్మద్ ఆఫిఫా ఫాతిమా,మరియ ఎడ్ల రిషికేశ్ వీరికి నేడు రామగిరి ఎస్సై శ్రీనివాస్ చేతుల మీదుగా తల్లిదండ్రుల సమక్షంలో గిన్నిస్ సర్టిఫికెట్లు అందజేత.శిక్షణ ఇచ్చిన ద్రోణచార్య స్పోర్ట్స్ అకాడమి కల్వచర్ల కరాటే మాస్టర్ మారుపాక సంపత్‌కి మరియు చిన్నారుల తల్లిదండ్రులకు అభినందనలు తెలియచేసారు.

## పంజ సంపత్‌కుమార్ ఎన్నిక పట్ల హర్షం




**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట ఆక్టోబర్ 14 :** తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పంజ సంపత్ కుమార్ ఎన్నికపట్ల సీనియర్ జర్నలిస్ట్ బండారి బాల్ రెడ్డిహర్షం వ్యక్తం చేశారు, ఈమేరకు పంజ సంపత్ కుమార్‌కు బుధవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు బండారి బాల్రెడ్డి మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో అన్ని మండలాల్లో వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగిందని అదేవిధంగా ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇప్పించాలని అందుకోసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సంపత్‌కుమార్ పంజ కృషి చేయాలని ఆయన కోరారు.అదేవిధంగా ప్రభుత్వ విప్పు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్,సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్‌కు ఎల్లారెడ్డిపేట వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోనైన రగుడు వెంకటాపూర్ బైపాస్ రోడ్‌లో అయినా ఇప్పించాలని అదేవిధంగా ఉచిత బస్సు పాసులు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ఎల్లారెడ్డిపేట వర్కింగ్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం సంఘం తరఫున కృషి చేస్తానని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సంపత్ పేర్కొన్నారు.ఈ సన్మాన కార్యక్రమంలో జర్నలిస్టులు పెంటం శ్రీనివాస్,ఓగ్గు బాలరాజు యాదవ్,ఓగ్గు మహేష్ యాదవ్, పోతుల గాంధీ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కస్తూరి ప్రవీణ్ రెడ్డి గాజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొని ఘనంగా సన్మానించారు,

## పండుగ వేళ బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు

**చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 14 :** పండుగ వేళ గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీణవంక మండలంలోని హిమ్మత్‌నగర్, కొండపాక, పోతిరెడ్డిపల్లి, కోరపల్లి గ్రామాల మీదుగా జమ్మికుంటకు వెళ్లే టీఎస్ ఆర్టీసీ బస్సులను పండుగ రోజుల్లో నిలిపివేయడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.పాఠశాలలు నడిచే సమయంలో తిరిగిన బస్సులను రద్దు చేయడంతో సాధారణ ప్రజలు, మహిళలు,విద్యార్థులు ప్రయాణాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బంధువుల ఇళ్లకు, ఊళ్లకు వెళ్లే ప్రయాణికులు గత్యంతరం లేక ప్రైవేట్ ఆటోలను ఆశ్రయించి అధిక ఛార్జీలు చెల్లించుకోవాల్సి వస్తోంది. అధికారులు వెంటనే స్పందించి ఈ రూట్లలో ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి ప్రత్యేక బస్సులు నడపాలని హిమ్మత్‌నగర్ వార్డు సభ్యులు కర్నకంటి నవ్య-భాస్కర్ రెడ్డితో పాటు గ్రామ ప్రజలు కోరారు.

## సీఎంని మర్యాదపూర్వకంగా కలిసిన పలు నియోజకవర్గ ఇన్చార్జీలు





**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 14 :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాదులో వారి నివాసగృహంలో సిరిసిల్లా, వేములవాడ నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇన్చార్జిలు ప్రభుత్వ విప్పు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డిలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.సిరిసిల్లా, వేములవాడ నియోజకవర్గాల అభివృద్ధి కోసం 350 కోట్ల మంజూరి చేసి బారి బహిరంగ సభ ద్వారా ప్రజల సమక్షంలో పౌండషన్ వేసినందుకు కేకే మహేందర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి పార్టీ కండువా కప్పి కృతజ్ఞతలు తెలియచేశారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన అదనపు కలెక్టర్



**చురకలు ప్రతినిధి,జగిత్యాల,అక్టోబర్ 14 :** జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ గా ఎస్.ప్రసూనాంబ బుధవారం బాధ్యతలు స్వీకరించగా మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్చం అందించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ బాధ్యతలను సమర్ధవంతంగా ప్రజలతో మమేకమై నిర్వర్తించాలని జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు.అనంతరం జిల్లా పరిపాలన అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు.

# ఆర్టీసీ ఐక్య కూటమి డిపో కార్యదర్శులకు ఘన సన్మానం

**-రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి**

**-విశ్రాంత ఉద్యోగుల సంఘం హుజూరాబాద్ డివిజన్ శాఖ డిమాండ్**



**చురకలు ప్రతినిధి హుజూరాబాద్ అక్టోబర్ 14 :** హుజూరాబాద్ ఆర్టీసీ డిపోలో ఇటీవల జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన ఐక్య కూటమి డిపో కార్యదర్శులు ఎంప్లాయీస్ యూనియన్‌కు చెందిన ఎం. రమేష్, టీఎంయూకు చెందిన శివ దయాల్ సింగ్‌తో పాటు హుజూరాబాద్ డిపో ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, న్యాయవాది ముక్కెర రాజు, ప్రజా సంఘాల నాయకుడు వేల్పుల రత్నంలను ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం హుజూరాబాద్ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించేలా కృషి చేయాలని, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని నూతనంగా ఎన్నికైన డిపో కార్యదర్శులను కోరారు. విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘం నాయకులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య, జగ్జీవన్ రామ్ కమిటీ అధ్యక్షుడు మట్టెడ ప్రకాష్, బీసీ ప్రజాస్వామ్య వేదిక అధ్యక్షుడు సాదుల రవీందర్ బాబు, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మార్త రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వేల్పుల ప్రభాకర్, కార్యదర్శి పేరాల లక్ష్మణరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. చారి, ఉపాధ్యక్షుడు ఈవీఆర్ నరసయ్య, కోశాధికారి ఏ.బి. రెడ్డి, ప్రచార కార్యదర్శి బత్తిని సంజీవ్, పోరెటి సమ్మిరెడ్డి, కొంపెల్లి వెంకటరెడ్డి, గోస్కుల ముత్యంరాజు, వి.డి. రెడ్డి, బుర్రి శేఖరయ్య, ఆర్.ఆర్. రెడ్డి, కేపీ రెడ్డి, బి.జి. రాజులు, ఎం. సారయ్య, సీహెచ్ ఆగయ్య, బింగి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# యువత సృజనాత్మక రంగంలో ముందుకు రావాలి

**-షార్ట్ ఫిలిం ఆవిష్కరణలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంకరి కుమార్**




**చురకలు ప్రతినిధి మంథని, అక్టోబర్ 13 :** యువత సృజనాత్మక రంగంలో ముందుకు రావాలని మంథని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంకరి కుమార్ పిలుపునిచ్చారు. మంథని ప్రెస్ క్లబ్ లో మంగళవారం మంథని ప్రాంతానికి చెందిన ప్రాయకరావు సతీష్ కుమార్ అలియాస్ చిన్న రూపొందించిన "అనుకోని పరిచయం" ఏఐ షార్ట్ ఫిల్మ్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ యువత కొత్త ఆలోచనలతో ముందుకు రావాలన్నారు. మంథని ప్రాంతానికి చెందిన ప్రాయకరావు సతీష్ కుమార్ అలియాస్ చిన్న ఏఐ టెక్నాలజీతో షార్ట్ ఫిల్మ్ రూపొందించడం అభినందనీయమన్నారు. యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రెస్ క్లబ్ తరపున ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు బర్ల సంపత్, ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య, కోశాధికారి తగరం రాజు సీనియర్ జర్నలిస్టులు కొమురోజు మారుతి, కొమురోజు చంద్రమోహన్, లక్కాకుల నాగరాజు తోపాటు పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

### శ్రీ దేవి యువసేన ఆధ్వర్యంలో

# ఘనంగా మహా అన్నప్రసాద వితరణ

**-అమ్మవారిని దర్శించుకున్న బిజెపి కార్పొరేటర్ కేపీపీ చంద్ర**




**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ అక్టోబర్ 14 :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 'శ్రీ దేవి యువసేన'ఆధ్వర్యంలో 19వ శరన్నవరాత్రి ఉత్సవాలు ఎంతో భక్తిశ్రద్ధలతో,వైభవంగా జరుగుతున్నాయి .నిత్య పూజా కార్యక్రమాలతో దేవి నవరాత్రి ఉత్సవాల నిర్వహణలతో ప్రాంగణమంతా భక్తిపారవశ్యంతో, కోలాహలంగా మారింది.ఉత్సవాల్లో భాగంగా బుధవారం రోజున ఎల్ ఎం డి కాలనీ,రామ్‌లీలా మైదాన్ ప్రాంగణంలో భక్తుల కోసం 'మహా అన్నప్రసాదం' వితరణ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా ఏర్పాటు చేశారు. కరీంనగర్ బిజెపి కార్పొరేటర్ కే పీపీ చంద్ర గారు శ్రీదేవి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక భక్తులతో కలసి మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్పొరేటర్ ఏపీపీ చంద్ర మాట్లాడుతూ శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం శ్రీ దేవి యువసేన సభ్యులు ఎంతో నిష్ఠతో, భక్తితో ప్రజలకు అన్నప్రసాద వితరణ చేయడం అభినందనీయమన్నారు అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరి పై సదా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ దేవి యువసేన కుటుంబ సభ్యులు, నిర్వాహకులు కొత్తూరి శ్రీనివాస్, బట్టు కరుణాకర్, కదార్ల శ్రీనివాస్, ప్రదీప్ , భవాని దీక్షపరులు , పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ పాఠశాలల్లో అదనపు ఫీజుల దోపిడీని అరికట్టాలి



**కరీంనగర్, అక్టోబర్ 14 :** కరీంనగర్ జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో విదేశీ కరికులం (ఆస్ట్రేలియన్,కేంబ్రిడ్జ్) పేరుతో తల్లిదండ్రులపై అదనపు ఫీజుల భారం మోపే ప్రయత్నాలను అరికట్టాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాధికారిని కలిసి ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ, ఇప్పటికే వరల్డ్ స్కూల్, ఇంటర్నేషనల్ స్కూల్, హెరిటేజ్ స్కూల్,ఈ-టెక్నో స్కూల్ ఒటి పేర్లతో కొన్ని విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు కేంబ్రిడ్జ్ , ఆస్ట్రేలియన్ కరికులం పేరుతో కొత్త విధానాలను ప్రవేశపెట్టి,విద్యను మరింత ఖరీదైనదిగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య అనేది ప్రతి బిడ్డకు అందాల్సిన హక్కు అని, దానిని కేవలం వ్యాపారంగా మార్చడం తగదని వారు స్పష్టం చేశారు. ఇప్పటికే అధిక ఫీజుల కారణంగా పేద, మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొత్త కరికులం పేరుతో అదనపు ఫీజులు వసూలు చేస్తే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని అన్నారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆటస్థలాలు ఉన్నాయా లేదా అనే అంశంపై అధికారులు సమగ్ర తనిఖీలు చేపట్టాలని బీసీ సంఘాల నాయకులు కోరారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఆటలు, క్రీడలు, విశాలమైన వాతావరణం ఎంతో అవసరమని, అలాంటి కనీస సదుపాయాలు కల్పించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులను అధికారులు పరిశీలించాలని డిమాండ్ చేశారు.విదేశీ కరికులం పేరుతో నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని కోరారు. దేశంలోని రాష్ట్ర మరియు సీబీఎస్ఈ కరికులం సక్రమంగా బోధించాలని కోరారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యా బోధన అందిస్తున్నారని సీబీఎస్ఈ కరికులం కూడా ప్రభుత్వ పాఠశాలలో బోధిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తమ పరిధిలోని పాఠశాలల పై ప్రత్యేక దృష్టి పెట్టి నాణ్యమైన బోధన. విద్యార్థులకు అందేవిధంగా చర్యలు చేపట్టి బడుగు బలహీన వర్గాల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు కేశిపెద్ది శ్రీధర్ రాజు, రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్, పెంట శ్రీనివాస్, మియాపురం రవీంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరైన వొడితల ప్రణవ్

**-అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి సొంతింటి కలను నెరవేరుస్తాం**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 14 :** అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ ఆర్థిక భరోసా కల్పించి, సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. హుజురాబాద్ పట్టణంలోని 29వ వార్డులో బుధవారం ఇందిరమ్మ ఇంటి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు నిర్మించుకోవాలని ఎదురుచూస్తున్న పేదల కలను ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తోందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు త్వరలోనే ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇంటి ద్వారా తమ సొంతింటి కల నెరవేరిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఇందుకు సహకరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ సుహాసిని, స్థానిక కౌన్సిలర్ మొగిలి, ఇతర కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిఖని టూ టౌన్ పో పరిధిలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ అక్టోబర్ 14 :** పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేకే నగర్ ప్రాంతంలో గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ ప్రాంతంలో కొందరు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు అందిన సమాచారం మేరకు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గుడుంబా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో 50 ద్విచక్ర వాహనాలను పరిశీలించి, నంబర్ ప్లేట్లు, సరైన పత్రాలు, ఇన్సూరెన్స్ లేని వాహనాలకు జరిమానాలు విధించారు.ఈ సందర్భంగా సీఐ ప్రసాద్ రావు మాట్లాడుతూ గంజాయి,ఇతర మాదకద్రవ్యాల వినియోగం,నిల్వ, సరఫరా,అక్రమ రవాణా,విక్రయం, సేవనం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించ బోమని హెచ్చరించారు. గంజాయి, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రమేయం ఉన్న వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్క్రాప్ దొంగతనాలు, పారిశ్రామిక సంస్థలు, ప్రభుత్వ,ప్రైవేట్ ఆస్తుల చోరీలు, దొంగిలించిన స్క్రాప్‌ను కొనుగోలు చేయడం,నిల్వ చేయడం,రవాణా చేయడం, విక్రయించడం వంటి నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు.ఇలాంటి నేరాలకు పాల్పడే వారిని గుర్తించి కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే, ప్రజలను భయాందోళనలకు గురిచేసే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.అలాగే మహిళల భద్రత,సైబర్ మోసాల నివారణ, సామాజిక మాధ్యమాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,ట్రాఫిక్ నిబంధనలు, డయల్-112 సేవలు,గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు.నేరాల నివారణ, నేరస్థుల గుర్తింపులో సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరించి,ప్రతి కాలనీ,నివాస ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ప్రజల భాగస్వామ్యంతో శాంతిభద్రతలను పరిరక్షించడం, పోలీసులకు మరియు ప్రజలకు మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడమే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని సీఐ తెలిపారు.

## మంత్రి చొరవతో 11 కెవి
# విద్యుత్ లైన్ సమస్య పరిష్కారం



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, అక్టోబర్ 14 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం రాజక్కపల్లె లో గత కొన్నేళ్లుగా 11కె వి విద్యుత్ లైన్ సమస్యకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో బుధవారం పరిష్కారమైనట్లు గ్రామసర్పంచ్ దోరిశెట్టి మల్లేశం తెలిపారు.గ్రామంలోని ఇళ్లపై నుంచి 11 కేవీ విద్యుత్ లైన్ వెళ్లడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఇళ్ల నిర్మాణాలకు ఆటంకాలు ఎదురయ్యినట్లు ఈ విషయం మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిం చడంతోగ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ సంబంధిత భూ యజమానులు గ్రామపంచాయతీకి తమవంతు సహాయంగా సుమారు 20వేల విలువైన గ్రాస్ కట్టర్ అందజేసినట్లు, స్ప్రే మిషన్ కూడా అందించే దుకు హామీ ఇచ్చారని సర్పంచ్ మల్లేశం తెలిపారు. విద్యుత్తు లైన్ సమస్య పరిష్కరించిన మంత్రికి సర్పంచ్, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# కువైట్ కార్మికుడికి పరిహారం కోసం వినతి



**-సీఎం ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించిన మృతుడి భార్య**

**చురకలు ప్రతినిధి,జగిత్యాల, అక్టోబర్ 14 :** జగిత్యాల రూరల్ మండలం మోరపెల్లి గ్రామానికి చెందిన చెట్పల్లి మీనయ్య కువైట్‌లోని గల్ఫ్ లెదర్ ఇండస్ట్రీస్‌లో సుమారు 20 ఏళ్ల పాటు షూ మేకర్‌గా పనిచేశారు. సెలవుపై స్వగ్రామానికి వచ్చిన సమయంలో కోవిడ్-19 బారినపడి 20 డిసెంబర్ 2020న మృతి చెందారు. ఆయన భార్య భాగ్యలక్ష్మి, ముగ్గురు కుమార్తెలు ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మీనయ్యకు రావాల్సిన పరిహారం,ఎండ్ ఆఫ్ సర్వీస్ బెనిఫిట్స్,గ్రూప్ ఇన్సూరెన్స్, ఇతర బకాయిలు ఇప్పించాలని కోరుతూ ఆయన భార్య భాగ్యలక్ష్మి హైదరాబాద్ ప్రజాభవన్‌లో నిర్వహిం చిన సీఎం ప్రవాసీ ప్రజావాణిలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేరిట వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన స్టేట్ నోడల్ ఆఫీసర్ కె. విద్యాసాగర్, కువైట్‌లోని సంబంధిత కంపెనీ నుంచి చట్టబద్ధంగా రావాల్సిన ప్రయోజనాలను ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని జీఏడీ ఎన్నారై విభాగం అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యుడు స్వదేశ్ పరికిపండ్ల, వాలంటీర్లు మహ్మద్ బషీర్ అహ్మద్, కె.పి. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారంపై ఎస్పీ కీలక ఆదేశాలు



**చురకలు ప్రతినిధి,నిర్మల్, అక్టోబర్, 14 :** నిర్మల్ జిల్లా ఎస్పీ.జానకి షర్మిల జిల్లా పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నేర సమీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా పెండింగ్ కేసుల పరిష్కారం,ఈ-పెట్టీ కేసుల డిస్పోజల్,దసరా బందోబస్తు, దుర్గామాత విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.60,90 రోజుల గడువులో దర్యాప్తు పూర్తి చేయాల్సిన కేసులను నిర్దేశిత సమయంలోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఎస్పీ ఆదేశించారు. కేసుల దర్యాప్తులో జాప్యం జరగకుండా, పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ-పెట్టీ కేసులను త్వరితగతిన పరిష్కరించి, పెండింగ్ లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దసరా పండుగ, దుర్గామాత ఉత్సవాలు, విగ్రహాల నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. నిమజ్జన మార్గాలు, చెరువులు, వాగుల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ, పండుగలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి,ఎస్బీ ఇన్స్పెక్టర్ మల్లేష్, డీసీఆర్బీ,ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు




**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ అక్టోబర్ 14 :** వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను కళాశాల ప్రాంగణంలో అత్యంత వైభవంగా నిర్వహించామని కళాశాల జనరల్ సెక్రెటరీ డాక్టర్ జి. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దసరా నవరాత్రుల ముందస్తు సంబరాల్లో భాగంగా కళాశాల యాజమాన్యం, మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు విద్యార్థుల ఆటపాటలతో పండుగ వాతావరణాన్ని తలపించాయి.ఈ సంబరాల్లో కళాశాల విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు సాంప్రదాయ దుస్తులలో మెరిసిపోయారు. తంగేడు, గునుగు, చామంతి, గుమ్మడి వంటి రంగురంగుల ప్రకృతి సిద్ధమైన పూలతో తీరొక్క బతుకమ్మలను అందంగా పేర్చారు. కళాశాల మైదానంలో బతుకమ్మలను మధ్యలో ఉంచి, వాటి చుట్టూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ, సాంప్రదాయ బతుకమ్మ పాటలతో సుదీర్ఘంగా ఆడిపాడారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యాసంస్థల కోశాధికారి గంద్ర శోభాదేవి గారు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే ఒక గొప్ప పండుగ అని, మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఎంతైనా ఉందని పేర్కొన్నారు.అనంతరం విద్యార్థులు తయారు చేసిన బతుకమ్మలలో ఉత్తమంగా నిలిచిన మొదటి మూడు బతుకమ్మలకు కళాశాల యాజమాన్యం తరపున బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రెటరీ డాక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ సభ్యులు విశ్వనాథ్ వినోద్, సి.హెచ్. ప్రకాష్ రెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. శ్రీనివాస్, ఫార్మసీ ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి,డాక్టర్ ఆర్.రామకృష్ణ మరియు విద్యార్థి, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# వార్తలు రాస్తే.. లాకప్‌లో చిత్రహింసలా?

**-జర్నలిస్టులపై 'థర్డ్ డిగ్రీ' ఉపయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం**
**-ఎస్ఐ శ్రీకాంత్‌తోపాటు బాధ్యులను వెంటనే సస్పెండ్ చేయాలి**
**-టీయూడబ్ల్యూజే (ఐజేయూ), కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్**



**చురకలు ప్రతినిధి కరీంనగర్, అక్టోబర్ 14 :** గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్ వ్యవహారశైలిపై వరుస కథనాలు ప్రచురించిన 'ఏక్ దమ్ న్యూస్'జర్నలిస్టులు సంపత్,ఎడిటర్ పొత్తూరి శేఖర్‌లను పోలీసులు అదుపు లోకి తీసుకుని,తీవ్రంగా కొట్టి, థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మని టీయూడబ్ల్యూజే (ఐజేయూ), కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులపై ప్రతీకార చర్యలకు దిగడం,పోలీసు కస్టడీలో చిత్రహింసలకు గురిచేయడం అత్యంత హేయమైనచర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ఘటనపై ఉన్నతాధి కారులు వెంటనే స్పందించి,ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐతో పాటు సంబంధిత పోలీసుల పాత్రపై స్వతంత్ర విచారణజరిపించాలనిడిమాండ్ చేశారు.

**వరుస కథనాల తర్వాత కేసులు.. అదుపులోకి తీసుకోవడం**

బాధితులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం.. గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్ ఆగడాలపై 'ఏక్ దమ్ న్యూస్' పత్రిక రెండు రోజులుగా వరుస కథనాలు ప్రచురించింది. ఆ కథనాల నేపథ్యంలో జర్నలిస్టులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. సోమవారం సాయంత్రం సుమారు 5 గంటలకు ఆన్‌లైన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైందని,అదే రోజు సాయంత్రం 7 గంటల ప్రాంతంలో కరీంనగర్‌లో సంపత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు.అరెస్టుకు ముందు తమకు నోటీసులు ఇవ్వలేదని బాధితులు ఆరోపించారు.అదే రాత్రి సుమారు 9.30గంటలకు కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం వద్ద ఉన్న ఎడిటర్ పొత్తూరి శేఖర్,ఆయన మిత్రుడు పీఈటీ శేఖర్‌ను పోలీసులు వాహనంలో తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.చట్టబద్ధమైన అరెస్టు ప్రక్రియ గురించి స్పష్టత ఇవ్వకుండా తీసుకెళ్లిన తీరు కిడ్నాప్‌ను తలపించిందని వారు ఆవేదనవ్యక్తం చేశారు.గంభీరావుపేట కు తరలించే క్రమంలో కరీంనగర్ బైపాస్ రోడ్డులోని పద్మానగర్ వద్ద పీఈటీ శేఖర్‌ను వదిలిపెట్టి, ఇద్దరు జర్నలిస్టులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

**వాహనంలోనే దాడి.. స్టేషన్లలో చిత్రహింసల ఆరోపణలు**

పోలీసు వాహనంలో తీసుకెళ్తున్న సమయంలోనే తమను అసభ్య పదజాలంతో దూషిస్తూ, బూట్లతో తన్ని, బెల్టులతో కొట్టారని బాధితులు ఆరోపించారు.గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించిన తర్వాత కూడా దాడులు కొనసాగాయని,అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట వరకు,ఆ తర్వాత కూడా వివిధ దశల్లో చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు. లాఠీలు, బెల్టులు, రబ్బరు బైర్లతో విచక్షణారహితంగా కొట్టారని పేర్కొన్నారు.ఇద్దరినీ కోనరావుపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అక్కడ కూడా థర్డ్ డిగ్రీ ప్రయోగించి,తిరిగి గంభీరావు పేటకు తీసుకొచ్చారన్న ఆరోపణలు ఉన్నాయని శ్రీనివాస్ తెలిపారు. ఏ పోలీస్ స్టేషన్‌లో,ఎవరి సమక్షంలో, ఎవరి ఆదేశాలతో దాడులు జరిగాయన్న విషయాలను విచారణలో తేల్చాలని డిమాండ్ చేశారు.

**ఫోన్లు తీసుకోవడంతో.. కుటుంబానికి సమాచారం ఆలస్యం**

ముగ్గురి మొబైల్ ఫోన్లను పోలీసు లు తీసుకోవడంతో వెంటనే ఎవరికీ సమాచారం అందించలేకపోయినట్లు పీఈటీ శేఖర్ తెలిపారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.పద్మానగర్‌లో వదిలిపెట్టిన తర్వాత ఆయన నడుచు కుంటూ రాత్రి సుమారు11.30 గంటల కు ఇంటికి చేరుకుని,పొత్తూరి శేఖర్ భార్య ప్రశాంతి ఫోన్‌నంబర్ తెలుసుకుని విషయం చెప్పినట్లు తెలిపారు.వెంటనే ప్రశాంతి డయల్ 100కు ఫోన్ చేసి తన భర్త ఆచూకీ కోసం సహాయం కోరారని పేర్కొన్నారు. సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా వాహనం కదలికల ను పరిశీలించిన తర్వాత,రాత్రి సుమారు 2 గంటలకు గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఉన్నట్లు సమాచారం అందిందని తెలిపారు.దీంతో ఆమె హుటాహుటిన బయలుదేరి తెల్లవారు జామున సుమారు 3గంటలకు గంభీరావుపేటకు చేరుకున్నారని వివరించారు.కుటుంబ సభ్యులు ఇలా అర్ధరాత్రి ఆచూకీ కోసం వెతుక్కో వాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని శ్రీనివాస్ ప్రశ్నించారు.

**సీఐ పాత్రపైనా విచారణ జరపాలి**

మరుసటి రోజు ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్ కూడా బాధితులపై మరింత దాడికి సిద్ధమయ్యారన్న ఆరోపణలు తమ దృష్టికి వచ్చాయని శ్రీనివాస్ పేర్కొన్నారు.కొన్ని ఫోన్‌కాల్స్ అనంతరం ఆయన ముందుకు వెళ్లలేదన్న కుటుంబ సభ్యుల వాదనతోపాటు, ఈ ఘటనలో ఆయన పాత్ర ఏమిటన్న విషయంపైనా విచారణ జరపాలని కోరారు.ప్రశాంతి ఆందోళనకు దిగిన తర్వాత కూడా జర్న లిస్టులను వివిధ ప్రాంతాలకు తిప్పి, రాత్రిసమయంలో సిరిసిల్లలో న్యాయ మూర్తి ఎదుట హాజరుపరిచినట్లు కుటుంబసభ్యులు తెలిపారనిపేర్కొన్నారు.

**న్యాయమూర్తికి బాధితుల వివరణ.. ఆసుపత్రిలో చికిత్స**

న్యాయమూర్తి ఎదుట హాజరైనప్పుడు పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి తమపై జరిగిన దాడులు,దూషణలు,చిత్రహింసలను ఇద్దరు జర్నలిస్టులు వివరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారి పరిస్థితిని గమనించిన న్యాయమూర్తి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించి,సొంత పూచీకత్తుపై విడుదలకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.21 రోజుల వ్యవధికి సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చినట్లు కూడా కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం అదే రాత్రి సుమారు 11 గంటలకు నడవలేని స్థితిలో కరీంనగర్ లోని ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారని వివరించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల నివేదిక తీసుకుని,అవసరమైన మెరుగైన వైద్యం అందించాలన్నారు.గాండ్ల శ్రీనివాస్ ఆసుపత్రికి వెళ్లి వివరాలు అడిగితెలుసుకొని పరామర్శించారు.

**అరెస్టు రక్షణల అమలుపై సమాధానం చెప్పాలి**

అరెస్టు అవసరం లేని సందర్భాల్లో హాజరు నోటీసు ఇవ్వాలని సూచించే భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 35(3)ఈ కేసు లో వర్తిస్తుందా,అరెస్టుకు అవసర మైన కారణాలు నమోదు చేశారా అన్న విషయాలను పరిశీలించాలని శ్రీనివాస్ కోరారు.సెక్షన్ 36ప్రకారం అరెస్టు మెమో తదితర విధానాలు పాటించారా, సెక్షన్ 47 ప్రకారం అరెస్టు కారణాలు తెలియజేశారా,సెక్షన్ 48 ప్రకారం కుటుంబ సభ్యులు లేదా సూచించిన వ్యక్తికి సమాచారం అందించారా అన్న అంశాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.సెక్షన్ 53ప్రకారం అరెస్టు అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి గాయాలను నమోదు చేశారా,సెక్షన్ 56 ప్రకారం కస్టడీలో ఉన్నవారి ఆరోగ్యం, భద్రతను కాపాడారా అన్న విషయాలు విచారణలో తేల్చాలన్నారు.

**వర్తించే సెక్షన్ల కింద బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**

వైద్య నివేదికలు,బాధితుల వాంగ్మూ లాలు,ఇతర ఆధారాల ప్రకారం ఉద్దేశ పూర్వకంగా గాయపరిచినట్లు తేలితే భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 115(2), తీవ్ర గాయాలైతే సెక్షన్ 117(2) వంటి వర్తించే నిబంధనల కింద చర్యలు తీసుకోవాలని కోరారు. నేరాన్ని ఒప్పించేందుకు లేదా నేరానికి సంబంధించిన సమాచారం రాబట్టేందు కు గాయపరిచినట్లు తేలితే సెక్షన్ 120(1),తీవ్ర గాయాలైతే లి120(2)ను పరిశీలించాలని డిమాండ్ చేశారు. చట్టవిరుద్ధ నిర్బంధం నిర్ధారణైతే సెక్షన్ 127(2),నిర్బంధాన్ని లేదా నిర్బంధించి న ప్రదేశాన్ని ఉద్దేశపూర్వకంగా రహస్యంగా ఉంచినట్లు తేలితే 127(6) ను పరిశీలించాలని కోరారు.హాని కలిగించే ఉద్దేశంతో ప్రభుత్వ ఉద్యోగి చట్టాన్ని తెలిసి ఉల్లంఘించినట్లు నిర్ధారణైతే సెక్షన్ 198 కింద చర్యలను పరిశీలించాలని పేర్కొన్నారు.ఏ సెక్షన్లు వర్తిస్తాయన్నది ఆధారాలు, వైద్య నివేదికలు, స్వతంత్ర దర్యాప్తు ప్రకారం నిర్ణయించాలని స్పష్టం చేశారు.

**సాక్ష్యాలను భద్రపరచాలి.. బాధ్యులను సస్పెండ్ చేయాలి**

గంభీరావుపేట, కోనరావుపేట పోలీస్ స్టేషన్ల సీసీ కెమెరా రికార్డులు, అంబేద్కర్ స్టేడియం,పద్మానగర్ పరిసరాల దృశ్యాలు,పోలీసు వాహనాల ప్రయాణ వివరాలు, స్టేషన్ డైరీలు, అరెస్టు మెమోలు,ఫోన్ల స్వాధీన రికార్డులు,డయల్ 100 కాల్ వివరాలు, వైద్య నివేదికలను వెంటనే భద్రపరచా లని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానికంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల ప్రభావానికి తావులేకుండా స్వతంత్ర ఉన్నతాధికారి తో విచారణ జరిపించాలన్నారు. ప్రాథమిక ఆధారాల మేరకు ఎస్ఐ శ్రీకాంత్‌తోపాటు దాడు ల్లో పాల్గొన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులను వెంటనే సస్పెండ్ చేసి,క్రిమినల్, శాఖాపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. జర్నలిస్టుల పై నమోదైన కేసు ప్రతీకార చర్యలో భాగమా అన్న విషయాన్నీ స్వతంత్రంగా పరిశీలించా లని డిమాండ్ చేశారు.బాధితులకు,వారి కుటుంబాలకు రక్షణ కల్పించి, వైద్య ఖర్చులను ప్రభుత్వం భరించాలని కోరారు.

**స్పందించకుంటే ఆందోళన బాట**

"వార్తల్లో తప్పులుంటే వివరణ ఇవ్వొచ్చు..ఆధారాలతో ఖండించొచ్చు.. చట్టబద్ధమైన మార్గంలోచర్యలు కోరొచ్చు కానీ వార్తలు రాసిన జర్నలిస్టులను లాకప్‌లో కొట్టి గొంతు నొక్కాలని చూడటం సహించేది లేదు.బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే టీయూడబ్ల్యూజే (ఐజేయూ),కరీంనగర్ ఆధ్వర్యంలో ఆందోళన బాట పడతాం.బాధిత జర్నలిస్టులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం"అని ఐజేయూ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్ గాండ్ల శ్రీనివాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ చంద్రశేఖర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎలగందుల రవీందర్ లు హెచ్చరించారు.

# ఆకట్టుకున్న శాకాంబరి అలంకరణలు



**రామ కిష్టయ్య సంగన భట్ల...**

ధర్మపురి క్షేత్రస్థ శ్రీరామలింగేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవ వేడుకలలో భాగంగా కూష్మాండ రూపిణియైన శ్రీశారదామాతకు బుధ వారం చేసిన శాకాంబరి అలంకరణలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

**శాకాంబరి ప్రత్యేకతలు**

పూర్వకాలంలో భూ లోకంలో అనావృష్టి సంభవించి, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురైన నేపథ్యంలో, మునీశ్వరు లంతా జగన్మాతను స్తుతించి, ఆకలి దప్పులతో అలరారు తున్న ప్రజలను కాపాడాలని ప్రార్థించారు. అప్పుడు ఆది దేవత కరుణించి 'శతాక్షీదేవి'గా ప్రజలచే కొలువ బడుదునని, తన దేహం నుండి అనేక విధములైన శాకములు ఉద్భవించి, సకాల వర్షాలు కురిసి, పాడి పంటలు సమృద్ధిగా కలిగి, భూతలం సస్యశ్యామలమై సుభిక్షంగా మారి భూలోకంలో ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లగల రని అభయ మిచ్చినట్లు పురాణ కథనాలు. అప్పటి నుండి శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని శాకాంబరీ మాతగా అలంకరించి పూజించడం ఆచారంగా వస్తున్నది. శ్రీశాకాంబరీతి పాఖ్యానంలో తదాయ స్వాంమేహం భువి అని చండీపాఠంలో వర్ణించిన రీతిలో బెండ, ఆలు, టమాటా, దొండ ఆదిగా కూరగాయలతో మాతను గురు వారం మాలాలంకృత గావించారు.రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ సంకటాల శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ సంగాభట్ల దినేష్, మున్సిపల్ చైర్పర్సన్ శ్రీ వేముల నాగలక్ష్మీ రాజేష్ దంపతులు, మాజీ దేవస్థాన అధ్యక్షులు శ్రీ జక్కు రవీందర్, వేదపండితతులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్ శర్మ, ఓంకార్ శర్మ, ఋత్విక్కులు తాడూరి బలరాంశర్మ, అలువాల కృష్ణ శర్మ, భరత్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరళ్ళ శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ఏ.శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ శ్రీ వి. తిరుపతి, మున్సిపల్ కౌన్సిలర్ ఒజ్జల లక్ష్మణ్, చీపిరిశెట్టి రాజేష్, అర్చకులు నేరళ్ళ విజయ్, సముద్రాల వంశీ, చక్రపాణి కిరణ్ కుమార్, అభిషేక పురోహితులు శ్రీ బొజ్జ రాజగోపాల్ శర్మ మరియు అర్చకులు, సిబ్బంది, ఋత్విక్కులు శ్రీ పాలెపు సందీప్ శర్మ, మరియు ఇతర ప్రముఖులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.సాయంత్రము శ్రీ యోగ, ఉగ్ర నృసింహస్వామి వార్ల ఊరేగింపు సేవ "శేషవాహనం"పై గ్రామములోని పురవీధులలో తిరిగి దేవాలయమునకు చేరు కున్నారు.రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి షోడశోపచార పూజతో హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ జరుపబడినవి.అలాగే శ్రీనర్సదేశ్వర మందిరంలో ప్రతిష్ఠిత దుర్గామాతకు వేద విదులైన పాలెపు చంద్రమౌళి శర్మచే చండీ పారాయణం, చతుషష్టి పూజలు నిర్వహించగా, అశేష భక్తజనం పాల్గొ న్నారు. టిటిడి కళ్యాణ మంటపంలో వంశీకృష్ణ, ప్రశాంత్, బల్యాపెల్లి, మహా శక్తి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.తిమ్మాపూర్ గ్రామంలోనూ శ్రీసీతారామాలయంలో శరన్నవరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గ గాయత్రి శివాలయంలో, వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆధ్వర్యంలో చతుష్షష్టి పూజలు గావించారు.

# అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్.ప్రసూనాంబ



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 14 :** జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఎస్.ప్రసూనాంబ బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమెను అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా నియమితుల య్యారు.గతంలో ఆమె తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించారు.అక్కడి నుంచి బదిలీ పై జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమితులై బుధవారం బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి కే.వై.ప్రసాద్,కలెక్టరేట్ ఏవో కిషన్,కలెక్టరేట్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.